క్లుప్తంగా

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: ప్రతి విద్యార్థీ అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదవాలని డీఎస్పీ బి.శ్రీనివాసులు సూచించారు. స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని సూచించారు. ఇందుకు తల్లిదండ్రులు చైతన్యం కావాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. అనంతరం పట్టణ సీఐ తేజమూర్తి, మహిళా ఎస్‌ఐ ఆశా బేగం బాలికల వేధింపులు, ర్యాగింగ్‌కు పాల్పడితే ఎలాంటి చట్టాలు అమలు చేస్తారన్న వాటిపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంధం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని ఏలంగి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు, కానాపురం గ్రామాల్లో ఆదివారం ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి శనివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పాపంపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కింద కొత్తూరు గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు మంజూరైన సంగతి విదితమే. పంచాయతీ పరిధిలోని పాపంపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్ నాగమణి, కాంట్రాక్టర్ రాయపాటి ఫణి, నాయకులు రాయపాటి రామాంజనేయులు, రాయపాటి బాబు, డిష్ రామాంజనేయులు శనివారం చర్చించి పనులను చేపట్టారు. గ్రామంలోని మెయిన్ రోడ్ నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకూ సీసీ రోడ్డు వేయనున్నట్లు నాయకులు తెలిపారు.

జ్యూవెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఘని



ఘనీని అభినందిస్తున్న సభ్యులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం జ్యూవెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్ఎంజీ ఘని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో కాళికాంబ ఆలయంలో శనివారం జరిగిన జ్యూవెలరీ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఘని, కార్యదర్శిగా హరూన్ బాషా, ఉపాధ్యక్షుడిగా వెంకటేశాచారి, గౌరవాధ్యక్షులుగా ఇస్మాయిల్, బీఎస్ ఓంకారాచారి, సభ్యులుగా బి.మురళి, సి.మురళి, బీఆర్ శివ, ఎస్.ముస్తఫా, ఆనంద్, మున్నా, కృష్ణ, బాబులాల్, ఎండీ సైఫుల్లా, జావెద్ ఎన్నికయ్యారు.

సచివాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ వెంకటనాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో పనిచేసి ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తిప్పయ్యదొడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచి, శుచితో కూడిన భోజనం అందించడంతో పాటు మెనూ పాటించాలని సూచించారు. ఏఓ నందకిశోర్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

బొకుప్ప: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్ఐ రామకృష్ణయ్య పలు అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు దిల్షాన్ బేగం, కేజీబీవీ ఎస్ఓ మంజుల తదితరులతో కలసి పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్-100, రహదారి భద్రత రూల్స్, సోషల్ మీడియా, గుడ్ టచ్, సైబర్ నేరాలు, దిశ యాప్‌ల గురించి ఎస్ఐ వివరించారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన బొలెరో

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపంలో అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన వెళుతున్న గొర్రెల మందపై బొలెరో వాహనం దూసుకెళ్లింది. ఘటనలో రూ.లక్ష విలువ చేసే పది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. శనివారం వేకువజామున కూడేరు మండలం రంగంపేటకు చెందిన ఉజ్జనప్ప తన గొర్రెలను మేపు కోసం కర్ణాటక ప్రాంతానికి తోలుకెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్ అతి వేగం, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.

ఇంటి వద్దకే పథకాలు జగనన్నకే సాధ్యం

- 'గడప గడప'లో మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



- ఇక్కడ వికలాంగ చిన్నారిని ట్రై సైకిల్లో కూర్చోబెట్టుకుని కనిపిస్తున్న మహిళ పేరు హరిజన రామాంజినమ్మ. ఆమెకు 15 ఏళ్ల వయస్సున్న కూతురు దివ్యాంగురాలు శ్యామల ఉంది. దివ్యాంగ పింఛన్‌తో పాటు జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ పంటల బీమా, విద్యా దీవెన, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న అమ్మ ఒడి తదితర పథకాలతో రూ.1.80 లక్షలు లబ్ధి చేకూరిందని రామాంజినమ్మ సంతోషం వ్యక్తం చేశారు.



- ఈ చిత్రంలోని మహిళ పేరు కాపు రుద్రమ్మ. ఊరు గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తన కుటుంబానికి రూ.3,59,358 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా బ్యాంకు ఖాతాలో జమ కావడంతో అవినీతికి ఆస్కారం లేకుండా పోయింది. మరో 20 ఏళ్లు జగనే ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆమె ఆశీర్వదించింది.



కళ్యాణదుర్గం రూరల్: పాలవాయిలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



గుమ్మఘట్ట: 75 వీరాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: అర్హుల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని పాలవాయి గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులతో ఆరాతీశారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, మహిళా రుణమాఫీ, రైతు భరోసా, ఫించన్లు తదితర పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసిన ఏకైక సీఎం జగనన్న అన్నారు. గతంలో మాదిరి జన్మభూమి కమిటీల పేరుతో పేద కడుపుకొట్టే పాలనకు ఈ ప్రభుత్వం చరమగీతం పాడిందన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలందిస్తున్న సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. పథకాల లబ్ధిదారులు, పేదలంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ఇంత మేలు చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టే కుయుక్తులు చేస్తున్నారని, వాటిని ఎవరూ నమ్మవద్దని పిలుపునిచ్చారు. అర్హులందరికీ పక్కా ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచు నాగరత్న, ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ లింగమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు వేణుగోపాల్, రామాంజనేయులు, వెంకటేశులు, పాతన్న, కృష్ణానాయక్, లోకేష్, దుర్గన్న, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం

గుమ్మఘట్ట: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పథకాలను నిలిపివేస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ఎల్లో మీడియా, టీడీపీ నాయకులు రోజూ విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు విఫలయత్నం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ బంగాళాఖాతంలో కొట్టుకుపోవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీపీ భవాని, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మంజునాథ, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కాంట్రాక్టర్లు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఆర్‌టీ కాంతారెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, సర్పంచులు రమేష్, ఉమేష్, ఎంపీటీసీలు గోవిందప్ప, ఈరన్న, మాజీ సర్పంచ్‌లు రంగప్ప, చిత్రశేఖరప్ప, నాయకులు రవి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కనుల పండువగా రథసప్తమి వేడుకలు



కళ్యాణదుర్గం: సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



రాయదుర్గం: భద్రావతి సమేత .. భావనా రుషి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వేడుకలు కనుల పండువగా సాగాయి. లక్ష్మీ వెంకటేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేకువ జామున 2 గంటలకు మేళతాళాల నడుమ దాతల స్వగృహం నుంచి శ్రీవారికి పూజా సామగ్రిని, పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. తెల్లవారుజామున 3 గంటలకు పూజ దాతలకు సంకల్పం, శ్రీవారి మూలవిరాట్‌లకు అభిషేకం, విశేష అలంకరణ, మహామంగళహారతి చేపట్టారు. 5.30 గంటలకు సూర్యప్రభ వాహనం, 9 గంటలకు పెద్ద శేష వాహనం, 11 గంటలకు గరుడ వాహనం, 1 గంటకు హనుమద్ వాహనం, 2 గంటలకు శ్రీవారి ఉత్సవమూర్తులకు చక్రస్నానం, 3 గంటలకు సింహ వాహనం, 5 గంటలకు సర్వభూపాల వాహనం, రాత్రి 8.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీవారిని పట్టణంలో ఊరేగించారు. మహిళా భక్తులచే శ్రీవారి సహస్రనామార్చనచే చంద్రబింబపు దీపాలతో దేవాలయాన్ని అలంకరించారు. వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. సీఐ తేజమూర్తి, ఎస్ఐ నాగమధుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

భద్రావతి సమేత .. భావనారుషి కల్యాణోత్సవం

రాయదుర్గం: పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో శనివారం భద్రావతి సమేత .. భావనారుషి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. పద్మశాలి కుల దైవం మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను పురస్కరించుకుని భక్తులు.. ఆదిదంపతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ఆలయం వద్దకు చేర్చి అభిజిన్ లగ్నంలో వేలాది మంది భక్తుల కోలాహలం నడుమ భక్తమార్కండేయుని కుమారుడు భావనరుషి కి సూర్యదేవుడి పుత్రిక భద్రావతితో వేదమంత్రోచ్చారణల మధ్య వివాహం జరిపించారు. నూతన పంచలోక విగ్రహాలను భీమనపల్లి మురళీకృష్ణ, బీమనపల్లి ప్రకాష్ బహూకరించి భక్తిభావం చాటుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, నాయకుడు పీ శివ, పద్మశాలి సంఘం అధ్యక్షుడు శివప్ప పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

సూర్యవాహనంపై వెంకటరమణుడి ఊరేగింపు

పట్టణంలోని కోటలో ఉనన ప్రసన్న వెంకటరమణుడి ఆలయంలో రథసప్తమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. వెంకరమణుడి దర్శన బాగ్యం కోసం భక్తులు వేకువ జామునుండే క్యూ కట్టారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకటరముణుడి ఉత్సవ విగ్రహాలను సూర్య వాహంపై ప్రతిష్టించి పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, దేవదాయ శాఖ అధికారులు, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



రాయదుర్గం: శ్రీవారి ఊరేగింపులో పాల్గొన్న విప్ దంపతులు

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



కల్యంలో రథం లాగి మొక్కు తీర్చుకుంటున్న విప్ కాపు

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట, రంగసముద్రం గ్రామాల్లో ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. రథసప్తమిని పురస్కరించుకుని ఆయా గ్రామాలలో ఆంజనేయ స్వామికి భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పూలకుంటలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి రథోత్సవం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, ఎంపీపీ భవాని, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ముసల రెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని కల్యంలో శనివారం రథసప్తమి వేడుకల అనంతరం ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సర్పంచ్ పుష్పావతి, ఎంపీటీసీ అనిత, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, నాయకులు నాగరాజు, కల్యం సురేష్ ఆలయంలో పూజలు చేపట్టారు. అనంతరం విప్ అన్నదాన కార్యక్రమానికి రూ.30 వేలు విరాళాన్ని అందించారు. యువకులతో కలసి నంది కోలు నాట్యం చేసి విప్ ఆకట్టుకున్నారు.

నేమకల్లు అంజన్నకు అభిషేకం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామికి శనివారం అభిషే కం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూ లవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కల్యాణదుర్గం రూరల్: మండలంలోని మానిరేవు గ్రామంలో శనివారం సస్యమిత్ర గ్రూపు సభ్యులు, క్లస్టర్ పరిధిలోని రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీటీ ఏఫ్ ఎకాలజీ ఎంటీఎల్ భవాని మాట్లాడుతూ రైతులు రసాయనిక మందులు, ఎరువులు వినియోగించి నష్టపోతున్నారన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే వనరులతో వ్యవసాయం సాగుచేయడం అలవర్చుకుంటే తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ సాయి, ఎస్టీఓ బాషా తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగలో పంట కోత ప్రయోగం

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో శనివారం వ్యవసాయాధికారులు పప్పుశనగలో పంట కోత ప్రయోగం చేపట్టారు. ఈ సందర్భంగా నాలుగు పొలాల్లో 2.900 కిలోలు, 2.100 కిలోలు, 2.800 కిలోలు, 3.05 కిలోల చొప్పున దిగుబడి వచ్చినట్లు ఏఓ నవత తెలిపారు.

తలసేమియాతో బాలుడి మృతి

గుమ్మఘట్ట: మండలకేంద్రంలో నివాసముంటున్న అనసూయమ్మ, రామాంజనేయులు కుమారుడు లోహిత్ (6) తలసేమియా వ్యాధితో మృతిచెందాడు. చికిత్స కోసం బాలుడిని తల్లిదండ్రులు ఇటీవల బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు విలపించడం అందరినీ కలచివేసింది.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు

వజ్రకరూరు: మండలానికి 31 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరైనట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ వెల్లడించారు. శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మండలానికి మంజూరైన రైతులకు అందజేశారు. ఏఈ మాట్లాడుతూ 2022 సెప్టెంబర్ 1 నుంచి 2022 డిసెంబర్ 31లోపు డీడీ చెల్లించిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయన్నారు.

యువకుడి బలవన్మరణం

బొమ్మనహాళ్: అనారోగ్య పరిస్థితిని తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బొమ్మనహాళ్‌కు చెందిన దానా గౌడ్ (35) కొంత కాలంగా పక్షవాతం, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక శనివారం ఉదయం దానాగౌడ్ మృతిచెందాడు. మృతుడి భార్య హేమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామానికి వెళ్లే మార్గంలోని హెచ్చెల్సీ 4వ డిస్టిబ్యూటరీలో శనివారం ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివ అక్కడకు చేరుకుని పరిశీలించారు. హెచ్చెల్సీ ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహంలో మృతదేహం కొట్టుకువచ్చినట్లు నిర్ధారించారు. మృతుడికి 35 సంవత్సరాల వయసుంటుంది. బ్రౌన్ కలర్ టీ షర్ట్, మెరూన్ కలర్ ప్యాంట్ ధరించాడు. శ్రీధరఘట్ట వీఆర్వో నరసింహమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు

కూడేరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. సుమారు రూ.6 లక్షలతో కొనుగోలు చేసిన ఇన్సునేటర్లు, హై ప్రెజర్ టాయిలెట్స్ క్లీనర్ పరికరాలను శనివారం తన చాంబర్‌లో సర్పంచులకు ఎంపీపీ పంపిణీ చేశారు. ఎంపీడీఓ ముస్తఫా కమల్‌బాషాతో కలసి ఎంపీపీ మాట్లాడుతూ శానిటరీ ప్యాడ్స్ తయారీలో ఉపయోగించిన రసాయనాలతో పర్యావరణం కలుషితమయ్యే ప్రమాదముందన్నారు. ఇన్సునేటర్లను చెత్తతో సంపద తయారీ కేంద్రాలు, హైస్కూల్స్ వద్ద ఏర్పాటు చేస్తామని శానిటరీ ప్యాడ్స్‌ను అందులో వేస్తే కాలి బూడిదవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఓబులేసు, హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవేంద్ర, శిద్దారెడ్డి, గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు పావని, లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ జలకళ' రైతులకు వరం

బొమ్మనహాళ్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన వైఎస్సార్ జలకళ పథకంతో రైతులు ఎంతో మేలు చేకూరుతుందని ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఏలంజి గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం కింద ఎంపికైన రైతుల పొలాల్లో బోరు వేసే కార్యక్రమాన్ని అధికారులు, రైతులు ప్రారంభించారు. వైఎస్సార్ జలకళ ద్వారా రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేయిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంపీపీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిమ్మక్క, ఎంపీటీసీ కోత్తూరు తిమ్మప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు శ్రేయస్కరం

కుందుర్పి: చిరు ధాన్యాల పంటల సాగు శ్రేయస్కరమని కళ్యాణదుర్గం డివిజన్ వ్యవసాయశాఖ సంచాలకుడు యల్లప్ప, రైతు సంఘం మండల అధ్యక్షుడు రామ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం మండలంలోని నిజవల్లి గ్రామంలో రైతులకు చిరుధాన్యాల పంటల సాగు, సేంద్రియ వ్యవసాయం, పురుగు మందుల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నారాయణస్వామి, ఆర్‌బీకే చైర్మన్ కృష్ణారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ బాబు, సిరికల్చర్ అసిస్టెంట్ పాతన్న, రైతులు పాల్గొన్నారు.

గొంతు కోసుకున్న వ్యక్తి..

గుమ్మఘట్ట: మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వలేదంటూ ఓ వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట నివాసి సదానందకు పదేళ్ల క్రితం బ్రహ్మసముద్రం మండలం గుండిగానపల్లికి చెందిన రాధమ్మతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన సదానందా.. పనీపాట చేయకుండా జులాయిగా మారాడు. మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వాలంటూ తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే శనివారం మద్యం కొనుగోలుకు డబ్బు కావాలని గొడవకు దిగడంతో భార్యాపిల్లలు గట్టిగా మందలించారు. దీంతో కుటుంబసభ్యులను బెదిరించేందుకు కాయగూరలు తరిగే కత్తితో గొంతు కోసుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రకటన

(1) ఎర్రిస్వామి తండ్రి ఎబ్బిలి రామన్న, అరవకూరు గ్రామం, (2) ఈటిగాని ఎర్రిస్వామి తండ్రి లేట్ రామక్రిష్ణయ్య, కూడేరు, (3) యస్.నరేష్ గౌడు తండ్రి లేట్ శివనారాయణ, కమ్మూరు గ్రామం, (4) కలిదిండి వెంకటనాగరాజు తండ్రి లేట్ కలిదిండి గోపాల్ రాజు, మారుతినగర్, మంగనూరు మం॥, మహబూబ్‌నగర్ జిల్లా అయిన మా కక్షిదారులకు అరవకూరు గ్రామస్థులు అయిన (1) రాప్తాదు మల్లమ్మ భర్త రాప్తాదు మాదన్న, (2) రాప్తాదు మాదన్న తండ్రి లేట్ రాప్తాదు ఎర్రిస్వామి, (3) రాప్తాదు రాజశేఖర్ తండ్రి రాప్తాదు మాదన్న, (4) శ్రీమతి బి.రాజమ్మ భర్త నారాయణస్వామి, అరవకూరు, (5) బి. ఎర్రమ్మ భర్త నరసింహులు తోపుదుర్తి అయిన మీరు ఐదుగురు షెడ్యూలు దాఖలా స్థిర ఆస్తిని విక్రయించుటకు గాను 20-08-2022న ఒప్పందము అగ్రిమెంటు వ్రాయించి ఇప్పటికి వెరశి రూ॥ 24,50,000/- చెల్లించినారు. అగ్రిమెంటు ఒప్పందము మేరకు 10-01-2023వ తేదీన రిజిష్టరు పత్రము వ్రాయించి ఇచ్చుటకు ఒప్పుకొని, ఉద్దేశ్యపూర్వకముగా ఒప్పందము ఉల్లంఘనచేసినారు. కావున పైన కనిన మా కక్షిదారులు చట్టపరమైన చర్యలు ఉపక్రమించినారు. కనుక షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఇతరులు ఎవ్వరు ఎటువంటి లావాదేవీలు జరిపిన యెడల చెల్లనేరవు మరియు మా క్లయింటు దారులయిన 1 నుండి 4 వారికి ఎటువంటి సంబంధము వుండనేరదని యావన్మందికి ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

షెడ్యూలు

అనంతపురము రి॥డి॥ అనంతపురము యస్॥ఆర్॥డి॥కి చెందిన కూడేరు మండలం కమ్మూరు గ్రామ పొలం అరవకూరు పంచాయతీ పేరయాలోని ఆస్తి వివరం.

బాబు వివరం	సర్వే నెం.	ఎ.సి.	ఎ.సి.	హెచ్.యస్.	ఖాతా నెం.
సర్కారు ఖుష్కీ	515	11-36 పైకి	1-21	0.488	273

చెక్కుబంది : తూర్పు : అరవకూరు గ్రామం రోడ్డు; పడమర : ప్రభుత్వం ఇండ్లు (జగనన్న కాలనీ); ఉత్తరం : సర్వే నెం. 515 లోని జమీను; దక్షిణం : సర్వే నెం. 523 లోని జమీను.

పి.బి. విఠల్, పి.బి. సిద్ధార్థ, అడ్వకేట్స్, అనంతపురము, సెల్ : 9440288427.

వైభవంగా సుంకులమ్మదేవి జాతర



సుంకులమ్మదేవి రథోత్సవ దృశ్యం

కణేకల్లు: మండలంలోని మాల్యం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం సుంకులమ్మదేవి జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకులు కుంకుమార్చన, మంగళారతి, పంచామృతాభిషేకం, ఆకుపూజలు చేశారు. సాయంత్రం రథంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ఊరేగించారు. రథంపై భక్తులు అరటిపండ్లను విసిరి మొక్కుబడులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కె.సత్యనారాయణ, ఆదిశేషులు, కె.మల్లికార్జున, సర్పంచు నరసమ్మ, ఎంపీటీసీ పాటిల్ ఉమ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ బ్రహ్మానందరెడ్డి, ఇమామ్‌వలీ, మల్రేగౌడ్ పాల్గొన్నారు. ఎస్ఐ దుగ్గిరెడ్డి, ఏఎస్ఐ ఈశ్వరయ్య బందోబస్తు నిర్వహించారు.

యూనిఫాం తప్పనిసరి

సెట్టూరు: గ్రామ సచివాలయ ఉద్యోగులు విధుల్లో ఉన్నప్పుడు తప్పనిసరిగా ఏకరూప దుస్తులు ధరించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి సూచించారు. శనివారం మండలంలోని కై రేవు సచివాలయం-2లో ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. యూనిఫామ్ ధరించని సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు, అనంతరం సిబ్బంది బయోమెట్రిక్ హాజరును, రికార్డుల నిర్వహణ, మూమెంట్ రిజిస్టర్లు పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్, జగనన్న చేదోడు, సిటీజన్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ శ్రీధర్‌తో కలసి చెర్లోపల్లి ఉన్నత పాఠశాలలో అనంత సంకల్పం కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్

ఉరవకొండ: బూదగవి సూర్యదేవాలయంలో జరుగుతున్న రథసప్తమి వేడుకల్లో పాల్గొనేందుకు శనివారం అనంతపురం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ దంపతులు వచ్చారు. స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ ఆలయ విశిష్టతను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. దేవదాయ శాఖ అధ్వర్యంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. అనంతరం ఈఓ అంగదాల కృష్ణయ్య, సర్పంచ్ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ నరసింహులు, ఉత్సవ కమిటీ సభ్యులు ధనంజయ, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, వడ్డే ఆంజినేయులు తదితరులు జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులను ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా ఉట్లమాను ఉత్సవం



ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

కుందుర్పి: మండల కేంద్రం కుందుర్పిలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు శనివారం ఉట్లమాను ఉత్సవం ఉత్సాహంగా సాగింది. ఉట్లమాను ఎక్కేందుకు యువకులు పోటీ పడ్డారు. బోయ నవీన్‌కుమార్ ఉట్లమాను ఎక్కి విజేతగా నిలిచాడు. ఉట్లమాను పైనుంచి యువకులకు సహాయ సహకారాలు అందిస్తున్న చంద్ర అనే భక్తుడు తాడు తెగడంతో కిందపడ్డాడు. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కార్యక్రమంలో ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.